AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

## సమ్మర్ క్యాంపులు షురూ



2

## బావిలో జారి పడి రైతు మృతి



2

## బోధన్ ఆర్డీవోగా విజయలక్ష్మి



**అక్షరటుడే, బోధన్:** బోధన్ ఆర్డీవోగా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించారు. రెవెన్యూ, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సక్రమంగా జరిగేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

11-5-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2



## అంగవైకల్యం భారం కాదు..: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** అంగవైకల్యం భారం కాదని, వారికి సేవ చేసే భాగ్యంగా భావించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. సమగ్ర శిక్ష, విద్యాశాఖ, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలకు అంగవైకల్యం ఉందని బాధపడొద్దన్నారు. భవిత కేంద్రాల్లో అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉపకరణాలను అందజేయడంతో పాటు భవిత కేంద్రాలను నిర్మిస్తుందని చెప్పారు. సదరం సర్టిఫికెట్ ఉన్నవారికి వికలాంగుల పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని పేర్కొన్నారు. అలాగే కొత్త పెన్షన్లను కూడా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం 393 మంది విద్యార్థులకు రూ.34లక్షల విలువ గల ఉపకరణాలను అందజేశారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. డీఈవో అశోక్, ఎంఈవోలు సాయారెడ్డి, ఎన్ఆర్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, ఆలింకో ప్రతినిధులు డాక్టర్ ప్రత్యూష్, ర్పొరేటర్ జ్యోతి మురళి, ప్రభాకర్ పవన్, కైరం కొండ మురళి పాల్గొన్నారు.



# కామారెడ్డి ఎంసీహెచ్‌పై సందిగ్ధం

కామారెడ్డి జిల్లా జనరల్ ఆస్పత్రి షిఫ్టింగ్‌పై జోరుగా చర్చ జరుగుతోంది. ఆస్పత్రి షిఫ్టింగ్ సరే.. వసతుల కల్పన మాట ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎంసీహెచ్ కోసం నిర్మించిన భవనంలో ప్రస్తుతం మెడికల్ కళాశాల నిర్వహణ కొనసాగుతుండటంతో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ కేంద్రం ఎక్కడ.. ఎలా నిర్వహిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే మెడికల్ కళాశాలకు పూర్తిస్థాయిలో స్థలం సేకరణపై దృష్టి పెట్టక పోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– అక్షరటుడే, కామారెడ్డి

- జీజీహెచ్‌లోనే కొనసాగించాలని డిమాండ్
- జులైలో మెడికల్ కళాశాలకు మారనున్న జీజీహెచ్
- అక్కడకు వెళ్లాలంటే గర్భిణులకు తిప్పలు

కామారెడ్డి పట్టణంలో ఏరియా ఆస్పత్రి ఉన్నప్పుడు అందుకు అనుగుణంగా రోగుల సంఖ్య ఉండేది. ప్రస్తుతం జీజీహెచ్ గా మారడంతో రోగుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలకు సంబంధించిన రోగులు జీజీహెచ్‌కు తరలివస్తున్నారు. అయితే వారికి సరిపడా వసతులు లేకపోవడం, ఇరుకు స్థలంలో ఆస్పత్రి నిర్వహణపై విమర్శలు వస్తుండటంతో జీజీహెచ్ షిఫ్ట్ చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే కొత్తగా మారే భవనంలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఎంసీహెచ్ స్థానంలో మెడికల్ కళాశాల

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కామారెడ్డి జీజీహెచ్‌లో గర్భిణులు, చిన్నపిల్లలకు ఇబ్బంది అవుతుందని ఎన్‌హెచ్ఆర్ఎం నిధుల ద్వారా కామారెడ్డికి ప్రత్యేకంగా మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి మంజూరు చేశారు. 2018 జనవరి 24న నాటి ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఎంసీహెచ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎంసీహెచ్ పనులు పూర్తయ్యాయి. ఎంసీహెచ్ పూర్తయి అందుబాటులోకి వచ్చే సమయానికి కామారెడ్డి జిల్లాకు 20 ఎకరాల్లో రూ.232 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరైంది. అయితే మెడికల్ కళాశాల పనుల నిర్వహణ మొదలు కాలేదు. దాంతో మెడికల్ కళాశాల ప్రారంభించాలని, అకడమిక్ ఇయర్ కొనసాగించాలని ఆఘమేఘాల మీద ఎంసీహెచ్ కోసం సిద్ధమైన భవనాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించారు. అప్పటినుంచి ఎంసీహెచ్ జీజీహెచ్ లోనే కొనసాగుతుండగా ఎంసీహెచ్ కోసం ప్రత్యేకంగా నిర్మించిన భవనంలో మెడికల్ కళాశాల కొనసాగుతోంది.

### జూలైలో జీజీహెచ్ తరలింపు

అయితే ప్రస్తుతం ఉన్న జీజీహెచ్ భవనం శిథిలావస్థకు చేరుకోవడం, ఆస్పత్రి కూడా ఇరుకుగా మారడంతో ఆస్పత్రి మొత్తాన్ని మెడికల్ కళాశాలకు షిఫ్ట్ చేయాలని నిర్ణయించారు. జులై నెలలో ఆస్పత్రి మొత్తాన్ని షిఫ్ట్ చేసి మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందజేయడానికి సిద్ధం చేస్తున్నారు. కళాశాల ఆవరణలో 30 పడకల క్రిటికల్ కేర్, హాస్టళ్లు, వైద్యుల క్వార్టర్స్, పరిపాలన విభాగానికి సం బంధించిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇకపై జనరల్ ఆస్పత్రితో పాటు పూర్తిస్థాయిలో మెడికల్ కళాశాల కొనసాగనుంది.



### గర్భిణులకు రవాణా తిప్పలు

ప్రస్తుతం కొనసాగుతున్న జీజీహెచ్ సిటీ మధ్యలో ఉండటంతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంది. జీజీహెచ్ పట్టణ శివారులోని మెడికల్ కాలేజీ భవనానికి మారిస్తే.. ప్రజలకు రవాణా భారం పెరగనుంది. ముఖ్యంగా ఎంసీహెచ్ కూడా మెడికల్ కళాశాల వద్దకు షిఫ్ట్ చేస్తున్నట్టుగా ప్రచారం అవుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తం అవుతోంది. మెడికల్ కళాశాలకు వెళ్లాలంటే సరస్వతి శిశుమందిర్ పక్క నుంచి గల్లీలో వెళ్లాల్సి వస్తోంది. ఈ దారి గర్భిణులకు అంత సురక్షితం కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి మీదుగా మెడికల్ కళాశాలకు దాదాపు 2 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న జీజీహెచ్‌లోనే ఎంసీహెచ్ కొనసాగించాలన్న డిమాండ్ పెరుగుతోంది.



## కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాల అభివృద్ధి: పోచారం

**అక్షరటుడే, కోటగిరి:** కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్లో ఎంఎంఆర్ కల్యాణ మండపాన్ని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇంటి ఎదుట పందిళ్లు వేసేశారని.. ఇప్పుడు అలా వేయాలంటే ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఫంక్షన్ హాళ్ల వైపు మొగ్గుచూపుతున్నారు. బాన్సువాడ ఏఎంసీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, పుప్పాల శంకర్, గంధపు పవన్, సిరాజుద్దీన్, ఎజాజ్ ఖాన్, గంగాధర్, నబీ, దిలీప్ కుమార్, సాయా గౌడ్, మేనేజర్స్ బ్రహ్మారెడ్డి, గజానన్, మహేందర్ పాల్గొన్నారు.




## కలెక్టరేట్ ఎదుట ట్రాన్స్‌జెండర్ల ధర్నా.. గ్రామాల్లోకి రానివ్వడం లేదని ఫిర్యాదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కలెక్టరేట్ ఎదుట ట్రాన్స్‌జెండర్లు ధర్నాకు దిగారు. తమను గ్రామాల్లోకి రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజావాణి లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి గంగ, జరీనా బేగం మాట్లాడుతూ.. గ్రామాల్లోకి ట్రాన్స్‌జెండర్లు వీడీసీలు ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల సిరికొండ మండలం మైలారం గ్రామంలో చిన్న పిల్లల్ని అపహరిస్తున్నారంటూ భౌతికదారులకు దిగారన్నారు. తమను పూర్తిగా సామాజిక బహిష్కరణ చేయడం ఎంతవరకు సబబని ట్రాన్స్‌జెండర్లు ప్రశ్నించారు. ఎక్కడైనా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరిగితే వెళ్లి వారిని ఆశీర్వదించి ఇచ్చినంత తీసుకొని వస్తామని.. అలాంటి తమపై దుష్ప్రచారం చేయడం సరైనది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్షర, ఆర్తి, శ్యామల, ఆసది, అలక, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నిజామాబాద్ కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన కో-ఆప్షన్ ఎన్నిక ఎట్టకేలకు పూర్తయింది. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ కూరగాయల ఉమారాణి అధ్యక్షతన జరుగగా.. పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజామాబాద్ నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలు పూర్తిచేశారు. కార్పొరేటర్ల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. స్పెషల్ కేటగిరి జనరల్ కోటాలో ముజీబ్ హైమద్, మాజీ కార్పొరేటర్ బొబ్బిలి మాధురి, కల్లెడ అశోక్ కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. మైనారిటీ కోటా కింద ఉజ్మా జరనామ్, సర్దార్ నరేందర్ సింగ్‌లు ఎన్నికయ్యారు.



## ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 77 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, హౌసింగ్ ఏఈ నివర్తి, ఎస్‌హెచ్‌వో విజయ్ బాబులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ.. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈనెల 15న రాష్ట్ర సమాచార కమిషన్ హాజరవుతున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబర్చిన బాలబాలికలను కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొరం అక్రమ తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మొరం అక్రమ తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపు దాడులు చేసింది. ఈ క్రమంలో రెండు జేసీబీ యంత్రాలు, 13 ట్రాక్టర్లను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సీపీ సాయిచైతన్య సూచనల మేరకు మొరం అక్రమ తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు పక్కా సమాచారం సేకరించారు.



అనంతరం సీసీఎస్ ఏసీపీ ఇన్‌ఛార్జి మస్తాన్ అలీ నేతృత్వంలో చీతా ఫోర్స్ సిబ్బంది ధర్పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామంలోని పెద్ద వాగు ప్రాంతంలో ఆకస్మిక దాడులు చేశారు. అనుమతులు లేకుండా మొరం అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న వాహనాలను గుర్తించారు. అనంతరం 2 జేసీబీ యంత్రాలు, మొరం రవాణాకు వినియోగిస్తున్న 13 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, సహజ వనరులు దెబ్బతింటాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా వాగులు, చెరువులు, పరిసర ప్రాంతాల పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం ధర్పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. సంబంధిత వ్యక్తులపై మైనింగ్, ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన వంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఇసుక రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇసుక రవాణా విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. సోమవారం ఐడీవోసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రీచ్‌లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇసుక వాహనాల రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయం భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిర్దేశిత ఇసుక రీచ్‌ల నుంచి తరలించేందుకు అనుమతించారు. సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్డీవో రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ నుంచి గొప్ప నాయకులు ఎదిగారు : షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** దేశంలో ఎంతోమంది యువజన కాంగ్రెస్ నుంచే గొప్ప నాయకులుగా ఎదిగారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలోని ఎస్‌వీ గార్డెన్‌లో భిక్కనూరు మండల యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షబ్బీర్ అలీ పాల్గొని నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ అనేది కేవలం ఒక రాజకీయ విభాగం మాత్రమే కాదని, భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేసే పాఠశాల అని పేర్కొన్నారు. తాను యువజన కాంగ్రెస్‌లో పని చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నామని తెలిపారు. అసెంబ్లీలోకి చొచ్చుకెళ్లిన ఉద్యమంలో పాల్గొన్నందుకు నెల రోజుల పాటు జైలుశిక్ష అనుభవించానని, కానీ ప్రజల కోసం చేసిన ఆ పోరాటమే తన రాజకీయ జీవితానికి బలమైందని చెప్పారు. కేవలం 30ఏళ్ల వయసులోనే మంత్రి అయ్యానంటే దానికి కారణం యువజన కాంగ్రెస్‌లో చేసిన పోరాటాలేనని పేర్కొన్నారు. యువత ఎప్పుడూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రతిపక్షాల అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలపై ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే యువత పాత్ర అత్యంత కీలకమని, ప్రతి గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. యువత ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.



## ఇంటర్ విద్య విలీనాన్ని నిలిపేయడంపై అధ్యాపకుల హర్షం



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలపకుండా నిలిపేయడంపై అధ్యాపకుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఇంటర్ విద్య ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి చేసిన కృషిని అభినందిస్తూ సోమవారం ఇంటర్ విద్య కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఇంటర్ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ.. ఇంటర్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలిపితే వచ్చే ఇబ్బందులు, సాంకేతిక సమస్యలను ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారన్నారు. దీంతో ఈ ఏడాది ఎప్పటిలాగే ఇంటర్‌లో అడ్మిషన్లు నిర్వహించుకునేందుకు సీఎం అనుమతించారని చెప్పారు.

## ఆర్మూర్ సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన



**అక్షరటుడే, ఆర్మూర్:** రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాంపూర్ రైతులు ఆందోళన చేపట్టారు. ఆర్మూర్ పట్టణంలోని సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం రైస్‌మిల్లులకు తరలిస్తున్నారని కేవలం ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామంలో మాత్రం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గ్రామంలో 7వేల బస్తాల ధాన్యం తూకం వేసినప్పటికీ లారీలు లేక ఎక్కడ ధాన్యం అక్కడే రోడ్ల పైన పడి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కువ మంది దళితులే ఉన్నారని.. ప్రభుత్వం దళిత రైతుల పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించారు. తక్షణమే సబ్ కలెక్టర్ రాంపూర్ గ్రామాన్ని సందర్శించి ధాన్యం కష్టాలను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, రాంపూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య అభివృద్ధి కోసం..



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సమ్మర్ క్యాంప్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం, వివిధ నైపుణ్యాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఎంఈవో శ్రీహరి మాట్లాడుతూ వివిధ రకాల కళాకృతుల తయారీ, చిత్రలేఖనం, అబాకస్ శిక్షణతో పాటు ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకునేలా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ఉంటాయన్నారు. తరగతుల కోసం ప్రభుత్వం అందించిన వస్తువులను హెచ్‌ఎం సుజాత విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో గండివేట్ హెచ్‌ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ శారద, ఉపాధ్యాయ బృందం రాజా పండిత్, మల్లేష్, రాధాదేవి, చక్రధర్, శంకర్ గౌడ్ , శ్రీనివాస్, సాయిలు ఇబ్రహీం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోట గాంధీ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వేసవిలో విద్యార్థులు బయట తిరగకుండా ఉండేందుకుగాను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. యోగా, ఇండోర్ గేమ్స్ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలవంతరావు, విద్యారమణ, కృష్ణ, ప్రదీప్, గోపి, మధు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్‌లు షురూ..

■ ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు ■ వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**‘ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక’లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ‘ప్రత్యేక విద్యా వారోత్సవం’ నిర్వహించనుంది. దీంట్లో భాగంగా ఉమ్మడిజిల్లాలో విద్యార్థుల కోసం సమ్మర్‌క్యాంప్‌లు ప్రారంభమయ్యాయి. సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**

## కోటగిరిలో..



**అక్షరటుడే,కోటగిరి** : పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమ్మర్ క్యాంప్‌ను సర్పంచ్ కల్లూరి సంధ్య, ఎంఈవో శంకర్, స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. 25వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొనవచ్చన్నారు. మ్యూజిక్, డ్యాన్స్, డ్రాయింగ్, స్టోరీస్ టెల్లింగ్, చెస్, ఇండోర్ గేమ్స్, కుట్లు, అల్లికలు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిలు, పాఠశాల ఏఏపీసీ ఛైర్మన్ అనురాధ, గంధపు పవన్, గంట్ల విఠల్, అనిల్, శంకర్, ధన్‌రాజ్, దత్తు, ఉపాధ్యాయులు నాగ్‌నాథ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో విజ్ఞానం.. వినోదం



**అక్షరటుడే, బాల్కొండ:** వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పొందేందుకు సమ్మర్ క్యాంప్‌లు ఎంతో ఉపయోగపడతాయని బాల్కొండ సర్పంచ్ గాండ్ల రాజేష్ అన్నారు. సోమవారం బాల్కొండ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో యోగా, ప్రాణాయామం, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్, శాస్త్రీయ నృత్యం, కంప్యూటర్ శిక్షణ, ఇండోర్ గేమ్స్ వంటి అంశాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ ఈ క్యాంప్ 15 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టాపూర్ సర్పంచ్ సట్ల ప్రవీణ్, కిషన్ నగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణవేణి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కుబీర్ శ్రీనివాస్, సీఆర్పీ ప్రభాకర్, సుమలత, ఎంఐఎస్ సుమన్, కంప్యూటర్ ఆపరేటర్ సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం బాధితులైన శ్యామలాదేవి, ఆలూరు నారాయణ, భోజన్న, దేవేందర్, కృష్ణారెడ్డి, నారాయణ, మునిపల్లి రఘు, ఇస్సపల్లి రూపేష్ తదితరులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి: మాజీ ఎమ్మెల్యే జాజాల



**అక్షరటుడే, గాంధారి:** కేంద్ర మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గాంధారి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోక్సో కేసులో సామాన్యులకు ఒక రూల్.. బండి సంజయ్‌కి ఒక రూల్ ఎలా ఉంటుందని ప్రభుత్వాన్ని.. పోలీసులను మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. న్యాయం కావాలంటూ ఓ బాధితురాలు ప్రభుత్వాన్ని కోరడం దానికి ప్రభుత్వం స్పందించకపోవడం చాలా చిత్రంగా ఉందన్నారు. బీజేపీ దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తుందని ప్రగల్భాలు చెప్పుకోవడం కాదని.. వాటిని ఆచరణలో పెట్టి చూపించాలన్నారు. పోక్సో కేసు నమోదైన అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చాల్సింది పోయి పోలీసులు మీనమేషాలు లెక్కించడం ఏమిటని జాజాల ప్రశ్నించారు. ఈ కేసుకు బండి సంజయ్‌ను బాధ్యుడిని చేస్తూ ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

## జీపీవోలకు అసిస్టెంట్లను నియమించాలి..




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో జీపీవోలకు అసిస్టెంట్లను నియమించాలని జీపీవో నిజామాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సంగెం పృథ్వీరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీపీవో వ్యవస్థను తీసుకొచ్చిందని సంగెం పృథ్వీరాజ్ పేర్కొన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో సర్టిఫికెట్ల జారీ, భూములు తనిఖీ, ప్రభుత్వ పథకాల అమలు చేయడం జీపీవోలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఒక్కరే విచారణకు వెళ్లడం.. రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి మద్దతు లేకపోవడంతో పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నారన్నారు. జీపీవోలకు అసిస్టెంట్లను నియమిస్తే గ్రామస్థాయిలో ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీపీవోలకు సహాయకులను నియమించాలని కోరారు.

## అదుపు తప్పి కారు బోల్తా.. నలుగురికి గాయాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు ఓ కారులో భార్యాభర్తలు పిల్లలతో వెళ్తున్నారు. భిక్కనూర్ మండలం జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై ఒక్కసారిగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. జాతీయ రహదారిపై కారు బోల్తా పడటంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కారును పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.




## నగరంలో షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మ్ దగ్ధమైంది. విజయ్ టాకీస్ పక్క కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కాలనీవాసులు వెంటనే ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

## బావిలో జారి పడి రైతు మృతి



**అక్షరటుడే, కామారెడ్డి:** సొంత వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావిలో కాలు జారిపడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సదాశివనగర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్మ జోగిని లింగం(50) ప్రతిరోజు మాదిరిగానే ఆదివారం రాత్రి పొలం దగ్గరికి వెళ్లాడు. ఉదయం అయినా ఇంకా తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్ద అంతటా వెతికారు. ఎక్కడా లింగం జాడ కనిపించలేదు. దాంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పొలం వద్ద ఉన్న బావి వద్ద కాలు జారిన ఆనవాళ్లు కనిపించడంతో బావిలో వెతకగా లింగం మృతదేహం లభ్యం అయింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లింగం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ‘సాయ్’కు ఎంపికైన క్రీడాకారుడికి సన్మానం

**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి గ్రామానికి చెందిన తేలు శ్రీనివాస్ కుమారుడు తేలు శివ చరణ్ ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కర్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంజిత్ గౌడ్, చిట్టి పటేల్ శాలువాతో బాలుడిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ శివ చరణ్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు రాణా ప్రతాప్, ద్యాగ మహేష్, భరత్ రాజ్, శ్రీనివాస్, నర్సయ్య, అజయ్, లక్ష్మణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## ‘గ్రామంలోకి హిజ్రాలు రావొద్దు’




**అక్షరటుడే,డిచ్‌పల్లి:** గ్రామంలో హిజ్రాల రాకపోకలను నిషేధిస్తూ ధర్పల్లి జీపీ, వీడీసీ తీర్మానం చేశాయి. ఈ మేరకు గ్రామం ముఖద్వారం వద్ద సోమవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామంలో జరిగే శుభకార్యాలకు హిజ్రాలు వచ్చి రూ.వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పంచాయతీ, వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకుంటే వేధిస్తున్నారన్నారు. దీంతో గ్రామ పంచాయతీ, వీడీసీ సభ్యులు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటినుంచి గ్రామంలో జరిగే పండుగలు, వివాహ వేడుకలు, గృహ ప్రవేశాలు ఇతర కార్యక్రమాలకు హిజ్రాలు రావడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.